

రేపు లాటరీ పద్ధతిలో మిగులు సీట్ల భర్తీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని పెద్దపాడు అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతిలో ఖాళీగా ఉన్న మిగులు సీట్లను లాటరీ విధానంలో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి 12, ఎస్‌టి ఒక సీటు మిగిలి ఉందని పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీన ఉదయం పది గంటలకు బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో లాటరీ నిర్వహించి మిగులు సీట్లు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జయంతి వారోత్సవాల సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్మోహనరావు, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సేవా దృక్పథం అలవరుచుకోవాలన్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజ మార్పునకు నాంది అని అన్నారు. అత్యవసర సమయాల్లో ఎంతోమంది రోగులు సకాలంలో రక్తం అందక మరణిస్తున్నారని, రక్తం కొరత ఉన్న సమయంలో ఇటువంటి శిబిరాలు దోహదపడతాయన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. జిల్లాలో అవసరాలకు తగ్గట్లుగా రక్తనిల్వలు లేవని చెప్పారు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం లభించడం లేదన్నారు. రక్తదానం చేయడం ద్వారా మరికొందరి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, విద్యార్థుల హక్కుల కోసం పోరాటాలు చేయడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ఎస్‌ఎఫ్‌ఐ ముందుంటుందన్నారు. ఇందులో భాగంగానే అల్లూరి సీతారామరాజు వారోత్సవాల ముగింపు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ శ్రీనివాస్ పాత్రో, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ రవీంద్ర, ఐక్యుఎసి కోఆర్డినేటర్ హరిత, ఎన్‌సిసి కోఆర్డినేటర్ వై.పోలినాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంతోష్, తిరుపతి, రాజు, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు దక్కేదెవరికి..?

- ప్రారంభమైన గ్రామసభలు
- ఈనెల 14వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ
- ఇప్పటివరకు 403 గ్రామాల్లో సభలు
- 1228 మంది రైతులు అంగీకారం

జిల్లాలో పంట సాగు హక్కుదారుల పత్రాల (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ ప్రారంభమైంది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సభలను నిర్వహించి భూ యజమానులను ఒప్పించే పని మొదలుపెట్టారు. ఈనెల రెండో తేదీ నుంచి మొదలైన అవగాహనా సభలు 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కౌలు గుర్తింపు కార్డుల జారీ ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా, అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణలో నిమగ్నమవడంతో ఈసారి కొంత జాప్యం చోటు చేసుకుంది. కౌలు గుర్తింపు కార్డులపై ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు అవగాహనా సభలను తొందరగా పూర్తి చేసి సిసిఆర్‌సి కార్డులను త్వరితగతిన అందించేలా అధికారులు కార్యాచరణను మొదలుపెట్టారు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో అన్నిరకాల పంటలు కలిపి సుమారు 6.62 లక్షల ఎకరాల విస్తీర్ణం మేర సాధారణ సాగుగా ఉంది. అందులో ఈ ఏడాది 3.87 లక్షల ఎకరాల్లో వరి వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఇందులో సుమారు 1.50 లక్షల ఎకరాల పైన కౌలు రైతులే సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1.20 లక్షల మంది కౌలు రైతులు ఉంటారని ఒక అంచనాగా ఉంది. కౌలు గుర్తింపు లేక ఏటా వర్షాభావ పరిస్థితులు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. బీమా పరిహారం, బ్యాంకుల నుంచి రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు తదితర ప్రయోజనాలు పొందుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం పంట సాగు హక్కుదారుల చట్టం-2019 ప్రకారం సాగు హక్కు పత్రాలను జారీ చేసేందుకు సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరించే పని ఇప్పుడు ప్రారంభించింది. గతేడాది 7,700 మందికి రైతులకు కార్డులు అందించారు.


జిల్లాలో ప్రస్తుత పరిస్థితి

జిల్లాలో ఈ ఏడాది కనీసం పది వేల మందికి సిసిఆర్‌సి కార్డులను జారీ చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. సిసిఆర్‌సి కార్డులపై భూ యజమానులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. సిసిఆర్‌సి కార్డుల జారీకి డాక్యుమెంట్లు ఇవ్వడం వల్ల భూ యజమానికి ఎటువంటి ఇబ్బంది ఉండదంటూ వారికి భరోసానిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో చాలామంది భూ యజమానులు ముందుకొస్తున్నారు. ప్రస్తుతం 1366 రెవెన్యూ గ్రామాలు ఉండగా 430 గ్రామాల్లో ఇప్పటివరకు గ్రామసభలు నిర్వహించారు. సభలకు 9,714 మంది రైతులు హాజరు కాగా 1228 మంది అంగీకారం తెలిపారు. 137 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొత్త కార్డులతో పాటు కార్డుల రెన్యువల్ పైనా అధికారులు దృష్టిసారించారు. జిల్లాలో ఈ ఏడాది ఎంతమందికి కార్డులు దక్కుతాయనేది చూడాల్సి ఉంది.

ప్రయివేట్ ఒప్పందాలకే యజమానులు మొగ్గు

గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపుకార్డులు జారీ చేసే ప్రక్రియ 2019 వరకు సాగింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పంట సాగు హక్కుదారుల చట్టం-2019ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమాని రాతపూర్వక అగ్రిమెంట్ తీసుకోవాలి. ఎక్కువ శాతం మంది భూ యజమానులు ససేమిరా అంటున్నారు. ఒకట్రెండు ఎకరాల భూమి ఉన్న వారు స్థానిక రైతులకు కౌలుకి ఇచ్చి చాలామంది వలస వెళ్లిపోతున్నారు. ఆధార్‌కార్డు, పాస్ పుస్తకం కాపీలు ఇవ్వడానికి, రాతపూర్వక సమ్మతి తెలపడానికి వారు రావడానికి ఇష్టపడడం లేదు. భూ యజమానులు అంగీకరించకపోవడంతో వారు కోరిన కౌలు చెల్లించేలా ప్రయివేట్‌గా ఒప్పందాలు కుదుర్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో భూములకు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా, పత్రాలకు మాత్రం నోచుకోవడం లేదు. ప్రభుత్వమే హామీగా ఉండి పత్రాలు అందించేలా చూడాలని కౌలు రైతులు కోరుతున్నారు.

సాగు హక్కు పత్రాల జారీకి చర్యలు



కౌలు రైతులకు సాగు హక్కు పత్రాల జారీకి గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నాం. కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలంటే భూ యజమానులు అంగీకారం అవసరం. గ్రామసభల్లో యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆగస్టు వరకు సిసిఆర్‌సి కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతుంది.

- కె.శ్రీధర్, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



కలెక్టర్‌తో చర్చిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాను అన్నిరంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు. ఇరువురూ మంగళవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. శ్రీకాకుళం నగరంలో నాగావళి రివర్ ఫ్రంట్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నగర శివారులోని పాత్రునివలసలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక నివేదికను అందించాలన్నారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో రైతులకు విత్తనాలు, ఎరువులు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. త్వరితగతిన ప్రణాళికలు పూర్తి చేస్తామని చెప్పారు.

నాగావళి రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరం మీదుగా ప్రవహిస్తున్న నాగావళి నది (రివర్ ఫ్రంట్) అభివృద్ధి, సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు ఇతర అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగావళి నది పరివాహక ప్రాంతాన్ని పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చేసేలా ప్రాజెక్టులను గుర్తించాలన్నారు. నిపుణుల, సలహా కమిటీల ఏర్పాటుపై నిర్దిష్ట ఉత్తర్వులతో రావాలని అధికారులను ఆదేశించారు. నగరంలో నాగావళి నది వెంబడి ఉన్న విహార ప్రదేశాల గురించి అడిగి తెలుసుకున్నారు. గూగుల్ మ్యాప్ సహాయంతో నదీ పరివాహక ప్రాంత పరిస్థితులను అధ్యయనం చేశారు. తొలి విడతలో కోడి రామ్మూర్తి స్టేడియం వెనుక నుంచి కొత్త బ్రిడ్జి వరకు నాగావళి నదికి ఒకవైపు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఆహ్లాదకరమైన ఘాట్‌లు, కనీసం 15 నుంచి 20 అడుగుల వెడల్పు గల నడక మార్గాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. బెంచీలు, గ్రీన్ కవర్ వంటి సౌకర్యాలు, విశాలమైన పార్కింగ్, అద్భుతమైన లైటింగ్ ఏర్పాటు చేసేలా ప్రాజెక్టుకు ప్రణాళికను రూపొందించాలన్నారు. నాలుగైదు కిలోమీటర్ల మేర తొలి విడత అభివృద్ధి పూర్తి చేసి మలి విడతలో పొన్నాడ బ్రిడ్జి నుంచి డే అండ్ నైట్ వద్ద స్వర్గధామం వరకు పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్, పబ్లిక్ హెల్త్ ఇఇ సుగుణాకరరావు, మున్సిపల్ ఇంజినీరు గంగాధరరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేడు మండల కేంద్రాల్లో నిరసనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అఖిల భారత కోర్కెల దినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా జిల్లాలోని కార్మికులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆ సంఘ జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే బిజెపి తన పాత విధానాలనే కొనసాగించడానికి సిద్ధమవుతోందన్నారు. అన్నింటికంటే ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి సిద్ధమవుతోందని తెలిపారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, సేంద్రీయ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనాలు చెల్లించాలని, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు.

పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై కమిటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించే చట్టం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013పై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్టికల్స్ 14, 15 ప్రకారం లైంగిక వేధింపు అనేది స్త్రీ ప్రాథమిక సమాన హక్కులను ఉల్లంఘిస్తుందన్నారు. లైంగిక వేధింపులను నివారించడమే చట్టం ముఖ్య లక్ష్యమన్నారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. 2013లో ప్రవేశపెట్టిన పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టం (నివారణ, నిషేధం, దిద్దుబాటు)ను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా శాఖల ఉన్నతాధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్న తేడా లేకుండా కనీసం పది మంది ఉద్యోగులున్న ప్రతి కార్యాలయంలో కమిటీని ఏర్పాటు చేసి, అందుకు సంబంధించిన వివరాలు ఐసిడిఎస్ కార్యాలయానికి పంపాలన్నారు. సచివాలయాల్లోనూ ఈ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఒక కమిటీ (ఎల్‌సిసి) పనిచేస్తుందని, పది మంది కంటే తక్కువ మంది పనిచేసే సంస్థలు, కార్యాలయాల ఉద్యోగులు ఈ కమిటీని సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన దొర, డిసిఎల్ అజయ్ కార్తికేయ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, ఆర్‌టిఒ మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సన్యాసినాయుడు



తప్పుడు బిల్లు పత్రాలను పోలీసులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

తప్పుడు బిల్లులతో ఇసుక రవాణా

లారీని పోలీసులకు అప్పగించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాతపట్నం

తప్పుడు బిల్లులతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పోలీసులకు అప్పగించారు. హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ నుంచి ఒడిశా రాష్ట్రంలోని పర్లాకిమిడికి మంగళవారం ఇసుక లారీ వెళ్తోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కారులో వెళ్లి లారీని ఆపారు. ఇసుక రవాణాకు సంబంధించిన బిల్లును డ్రైవర్‌ను అడిగారు. ఆ బిల్లు బార్‌కోడ్‌ను స్కాన్ చేయగా సరిపోలేదు. పాత బిల్లులతో రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులకు ఇసుక లారీని అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమంగా ఎవరు తరలించినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలి



పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు మోహనరావు

ప్రజాశక్తి - నందిగాం

వంశధార ఎడమ కాలువ ద్వారా నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల్లోని శివారు భూములకు సాగునీరందించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల నాయకులు పాలిన సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని మర్లపాడు నుంచి కణితూరు వరకు ఉన్న కాలువను మంగళవారం పరిశీలించారు. మర్లపాడు రైల్వేట్రాక్ దగ్గర నుంచి కణితూరు వరకు ఉన్న వంశధార కాలువ 60 ఆర్ మరమ్మతుల్లేక కాలువలో రెల్లి, తూటికాడ తదితర వాటితో నిండిపోయి ఉన్నాయన్నారు. కణితూరు వద్ద పలాస పాత టెక్కలి వైపు వెళ్తున్న కాలువలకు ప్రొక్లెయినర్‌తో మరమ్మతులు చేసి నీరు విడిచిపెట్టారని తెలిపారు. పి.వి పురం, చెరుకుపల్లి, మర్లపాడు, కూర్మ, కొల్లిపాడు, కొండూరు, బొడ్డపాడు, సీతాపురం వరకు వెళ్లే కాలువకు మరమ్మతులు చేయలేదన్నారు. గతంలో పడిన గండ్లు కూడా పూడ్చలేదని చెప్పారు. దీంతో నీరు విడిచిపెట్టినా శివారు భూములకు నీరు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ కాలువకు మరమ్మతులు చేయలేదన్నారు. రైతులు వేసుకున్న నారుమళ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ పరిస్థితిని గమనించి ప్రభుత్వం, అధికారులు వెంటనే ఈ కాలువకు మరమ్మతులు చేసి సాగునీరు విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. షట్టర్ల కుంభకోణాన్ని సాకుగా చూపిస్తూ కొత్త షట్టర్లు, కాజ్‌వేలు ఏర్పాటు చేయకుండా, మరమ్మతులు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే కాజ్‌వే మరమ్మతులు చేయాలని కోరారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యారోగ్యశాఖ అధికారులతో మంగళవారం సమీక్షించారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బిఎస్‌కె, ఆరోగ్యశ్రీ, పిఎంఎంవివై, వెల్‌నెస్ సెంటర్లు, మాతాశిశుసంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, మాతాశిశు మరణాలపై చర్చించారు. జిల్లాలో ప్రస్తుతం కోటబొమ్మాళి, పొన్నాడ, వెన్నెలవలస రెసిడెన్షియల్ పాఠశాలల్లో జ్వరాలు సోకినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు.


జిల్లాలో సరిపడా మందుల నిల్వలు ఉన్నాయన్నారు. అంగన్వాడీ, ఆశా, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి సమన్వయంగా గ్రామస్థాయిలో పరిస్థితిని గమనించి అవసరాన్ని బట్టి వైద్యసేవలందిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ఆర్‌డబ్ల్యుఎస్ సహకారంతో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డి.షకీల, డిసిహెచ్‌ఎస్ జి.వి రాజ్యలక్ష్మి, రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.రవి వెంకటాచలం, ప్రోగ్రాం అధికారులు జి.వి లక్ష్మి, సి.పి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫారం పంపిణీలో అలసత్వం వద్దు



పలాస : విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫారాల పంపిణీలో అలసత్వం వహించద్దని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల రీసోర్స్ కేంద్రంలో యూనిఫారాలను మంగళవారం పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని పాఠశాలలకు యూనిఫారాలు పంపిణీ చేశారు, ఇంకా ఎన్ని పాఠశాలలకు పంపిణీ చేయాలి, రికార్డులో ఉన్న యూనిఫారాలు, గోదాములో ఉన్న దుస్తులు సరిపోయా లేదా పరిశీలించారు. యూనిఫారాలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, పోతనపల్లి బాలరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో ప్రగతిబాట



ర్యాలీ నిర్వహిస్తున్న గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో నిర్మాణరంగం ఊపందుకోనుందని, రాష్ట్రంలో ప్రగతికి ఇది దోహదపడుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడురోడ్ల కూడలిలో కీ.శే ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాలతో ఇసుక కొరత నెలకొని నిర్మాణ రంగం కుదేలైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు ప్రభుత్వం ఇసుక పాలసీ విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. అనంతరం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పాతబస్టాండ్ జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, జామి భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాఠశాల పరిసరాలపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో నెలకొన్న అపారిశుధ్యంపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అప్పటికే సాయంత్రం వేళ కావడంతో విద్యార్థులందరూ వెళ్లిపోయారు. తరగతి గదిలో ఉన్న పదో తరగతి విద్యార్థులు వద్దకు వెళ్లి కుశల ప్రశ్నలు వేశారు. విద్యార్థులందరికీ దుస్తులు, పుస్తకాలు అందజేశారా? అని అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులకు బూట్లు, సైజులు కుదరక సరఫరా చేయలేకపోయినట్లు ఉపాధ్యాయులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరుతున్న కలెక్టర్ పాఠశాల క్రీడామైదానంలో కట్టి ఉన్న పశువులను చూసి ఉపాధ్యాయుల ప్రశ్నించారు. వెంటనే పశువైద్యశాలకు పశువులను తరలించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు ఇతర వ్యర్థాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... తక్షణమే వీటిని తొలగించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఇన్‌ఛార్జి హెచ్ఎం ఎం.వి.రమణ పాల్గొన్నారు.

రక్త నమూనాలను సేకరించాలి

సీజనల్ ప్రత్యేకాధికారి ప్రసన్న

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సీజనల్ వ్యాధుల కాలంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పిల్లలకు రక్త పరీక్షలను తరచూ చేయాలని వైద్య సిబ్బందిని సీజనల్ ప్రత్యేకాధికారి వి.ఎస్.ఎస్.ఎల్.ప్రసన్న ఆదేశించారు. మండలంలోని వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలన్నారు. మలేరియా పాజిటివ్ కేసులకు తీసుకున్న జాగ్రత్తల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగుదొడ్లను, భోజనం నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు వేడి నీటిని అందించాలని. రాత్రి వేళల్లో రెగ్యులర్ సిబ్బంది ఉండి పర్యవేక్షించాలని సూచించారు. ఈమెతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర, ఎటిడబ్ల్యుఒ కృష్ణవేణి, మలేరియా అడిషనల్ డైరెక్టర్ ప్రసాదరావు, జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిడ్డిక ఉమ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సిపిఒ ప్రసన్న

భయాందోళనలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఒకనాడు గిరిజన ఆశ్రమ పాఠశాల పేరు చెబితే గిరిజన బాలికలు ఎగిరి గంతేసి విద్యను అభ్యసించడానికి ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం పాఠశాల పేరు చెబితే గిరిజన బాలికలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని వెన్నెలవలసలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 280 మంది గిరిజన బాలికలు విభిన్న పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల పాఠశాలలో చదువుతూ మలేరియా బారిన పడి బిడ్డిక రస్మిత మృతి చెందగా, మరో నలుగురు విద్యార్థులు మలేరియా బారిన పడి చికిత్స పొందుతున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అనారోగ్యానికి గురైన విద్యార్థినులను తమ సొంత గ్రామాలకు తీసుకువెళ్లి పాలకొండ, కొత్తూరు ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స కోసం చేర్పించారు. ఈ సంఘటన జరిగిన తర్వాత గిరిపుత్రుల తల్లిదండ్రులు ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడి వాతావరణ పరిస్థితులు చూసి భయపడుతున్నారు. తమ పిల్లలను చదివించలేమని, బదిలీ ధ్రువపత్రాలున అందించాలని సిబ్బందిని కోరుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను భయాందోళనలతో ఇంటికి తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది.



బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల

షిఫ్ట్ పద్ధతిలో వార్డెన్ల విధులు

రెగ్యులర్ వార్డెన్ ఇక్కడ లేకపోవడంతో ఎస్‌జిటి అధ్యాపకులతో రెండు నెలలకు ఒకరు చొప్పున వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో బాలికల భద్రత సంక్షేమం విషయంలో పారదర్శకత లోపించి పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో పిల్లలకు రక్షణగా ఎవరు, ఎప్పుడు విధులు నిర్వహిస్తున్నారో అర్థం కాని గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలలోని లోపాలను సరిదిద్ది ప్రక్షాళన చేసి గిరి పుత్రికలకు విద్యను అందించాలని తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉచిత ఇసుక సరఫరా ప్రారంభం



ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు, భవన నిర్మాణదారులకు మేలుచేకూరుతుందని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఉన్న ఇసుక రీచ్ పాయింట్ వద్ద మంగళవారం ఉచిత ఇసుక బండిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ఇసుక సరఫరా చేస్తామన్నారు. వినియోగదారులు అవసరం మేరకు ఇసుకని వినియోగించుకోవాలన్నారు. ముందుగా టిడిపి మండల పార్టీ నాయకులు బగాది శేషగిరి రిబ్బన్ కట్ చేసి రీచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో భూగర్భశాఖ కార్యాలయ ఎడి ఫణీంద్రభూషణ్‌రెడ్డి, తహశీల్దార్ బాలమురళీకృష్ణ, టిడిపి మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, బెహరా కాళీ, దల్లి ప్రసాద్‌రెడ్డి, కోరాడ రాంప్రసాద్, రెయ్యి ప్రీతీష్‌చంద్, బసవల అప్పల స్వామి, దొని కొండలరావు, సోడిమూడి కిరణ్‌కుమార్, మల్లిపెద్ది మధు, కోళ్ల కామేష్, మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పారదర్శకంగా ఇసుక సరఫరా

ప్రజాశక్తి- నరసన్నపేట

పారదర్శకంగా ఇసుక సరఫరా చేస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో ఇసుక మాఫియాగా ఏర్పడి ఇసుక సామాన్యులకు అందుబాటులో లేకుండాపోయిందన్నారు. టిడిపి హయాంలో నిబంధనల ప్రకారం ఇసుకను సరఫరా చేస్తామని, నిబంధనల ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం రవాణా ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. నియోజకవర్గంలో కొన్ని రీచ్‌లకు అనుమతులు వస్తాయని, అందరికీ నామమాత్రపు ధరకే అందజేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి చిట్టిబాబు, చంద్రశేఖర్, స్థానిక లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై హర్షం

కవిటి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీల అమలుపై దృష్టి సారించడం, అందులోనూ ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేయడం హర్షనీయమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ళ బడుగు బలహీనవర్గాలకు చెందిన వారు ఇసుక లభించక సొంతింటి నిర్మాణాలు నిలిపివేశారని అన్నారు. ఇకపై ఆ సమస్య ఉండదన్నారు. ఉచిత ఇసుక విధానంతో అన్ని తరగతుల్లో హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమమే పరమావధి భావించే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యాటకానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

టిడిపి ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని, నాలుగు మండలాలకు కేటాయించిన నిధులతో తీరప్రాంతాల్లో రహదారులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పంచాయతీ రాజ్ జెఇలతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కపాసుకుద్ది సముద్ర తీరానికి చేరుకునేలా గ్రామం ప్రధాన రహదారి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్‌శాఖ నుంచి నిధులు మళ్లింపుతోనే ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయని, భవిష్యత్‌లో పూర్తిస్థాయి కేటాయింపులు, పనులతో పిఆర్ శాఖను పరుగులు పెట్టించాలని అన్నారు. అనంతరం పిఆర్ శాఖలో గడిచినా ఐదేళ్లలో చేపట్టిన పనుల వివరాలు, నిధుల చెల్లింపు వివరాలు తెలుసున్నారు. గత ప్రభుత్వంలో నిధుల మళ్లింపు కారణంగానే ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయని, అరకొరగా పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక గొల్లుమంటున్నారని అన్నారు. అదే విధంగా రూర్బన్ నిధులపై సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నిధులు దుర్వినియోగం జరిగినట్టు గుర్తించారు. తక్షణమే వాటిపై పూర్తి సమాచారంతో నివేదిక అందజేయాలని సోంపేట జెఇని ఆదేశించారు. సమావేశంలో కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట జెఇలు పి.ప్రవీణ్ కుమార్, బిఆర్ దొళై, బి.హిమసాగర్, కె.రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి- కవిటి

జిల్లాలో సిబిఎస్ఇ చదువుతున్న ఒడియా మాధ్యమం విద్యార్థులు పదో తరగతి పరీక్షలు ఒడియా మాధ్యమంలోనే రాసేలా ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎపి ఒడియా టీచర్స్ అసోషియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు అపోటా రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ ఫాడి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దళాయి, ఉత్తరాంధ్ర ఒడియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి ఒక ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా తమ సమస్యలు తెలియజేస్తూ వినతిపత్రం అందించిన వెంటనే తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్న రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ఆంధ్ర ప్రదేశ్ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఎం.వి.కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్త మృతి

పలాస : కాశీబుగ్గ సెక్టార్ అంబుసోలికి చెందిన అంగన్వాడీ కార్యకర్త ఎం.శారద (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సుమారు ఏళ్లుగా అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ సేవలు అందించారు. ఆమె మృతిపై సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, వైసిపి నాయకులు సిర్ల రవిచంద్ర బుజ్జి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు యు.దానమ్మ, డి.సునీత, కార్యకర్తలు సంతాపం తెలిపారు.



శారద (ఫైల్)

జగన్‌తో రెడ్డి శాంతి భేటీ

పాతపట్నం : తాడేపల్లిగూడెంలోని మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డితో ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం భేటీయ్యారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని సమస్యలపై నిరంతరం పోరాడుతానని, నేరుగా పాలుపంచుకుంటానని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈమె వెంట వైసిపి నాయకులు రెడ్డి శ్రావణ్ ఉన్నారు.



జగన్‌తో రెడ్డి శాంతి



మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణచంద్రరావు

పశుగ్రాసంపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన పశు గ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పశువైద్యాధికారి మెట్ట పూర్ణచంద్రరావు మండలంలోని రంగాపురం గ్రామంలో పశు గ్రాస సాగును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పశు గ్రాసాలు పశువుల ఆరోగ్యంలో ముఖ్య పాత్రవహిస్తాయని అన్నారు. రోజుకు ఒక పాడి పశువుకు 20 కేజీల పచ్చ గడ్డి, 3-4 కేజీల ఎండు గడ్డి అవసరం అవుతాయని అన్నారు. ఈ పశుగ్రాసాల సాగు వల్ల దానా ఖర్చు తగ్గుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వరలక్ష్మి, గిరిబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గోవిందపురం పంచాయతీ గూనాలపాడులో ఉపాధి హామీ పనులున ఎంపిటిసి మాజీ సభ్యులు కర్ని రమణ గోవిందపురం పిహెచ్‌సి మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు ఊర చెరువులో కూలీలు పనులు చేపట్టారు. ఉపాధి హామీ కింద చెరువు మరమ్మతు పనులు చేపడుతున్నామని అన్నారు. కూలీలకు వంద రోజులు పనులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీపాన గోపి, వైస్ సర్పంచ్ గుంట సత్యం, కో-ఆప్షన్ మాజీ సభ్యులు పాలవలస వేణుగోపాల్, మెట్ట నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

డిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పొందూరు

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం లైదాం ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో బలివాడ వెంకటేశ్వర్లును డిటిఎఫ్ మండల అధ్యక్షులుగా ఎన్నికయ్యారని ఎన్నికల నిర్వాహకులుగా వ్యవహరించిన హరిప్రసన్న తెలిపారు. ఉపాధ్యక్షులుగా చౌదరి వేణుగోపాల్, తమ్మినైన విభీషణరావు, మండల ప్రధాన కార్యదర్శిగా గురుగుబెల్లి భాస్కరరావు, కార్యదర్శులుగా తమ్మినైన మురళీమోహనరావు, గండెం రామారావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా గురుగుబెల్లి గోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. సమావేశంలో 117 జీవోను తక్షణమే రద్దు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని, అమ్మకు వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అందివ్వాలని తీర్మానాలు చేశారు.

ఎపిటిఎఫ్ మండల అధ్యక్షునిగా ఢిల్లీరావు

సోంపేట: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ నూతన అధ్యక్షునిగా ఎ.ఢిల్లీరావు ఎన్నికయ్యారు. సోంపేట బాలికోన్నత పాఠశాలలో మంగళవారం బి.చక్రధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం మండల శాఖ అధ్యక్షునిగా పనిచేస్తున్న డి.గోవిందరావు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఆ స్థానంలో ఢిల్లీరావు ఎన్నికయ్యారు. ఆయనతో జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, మండలశాఖ ప్రధాన కార్యదర్శి జి.తిరుపతిరావు, సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సోంపేట : ఢిల్లీరావుకు పుస్తకాన్ని అందజేస్తున్న చాణక్య

మేలో ఫిర్యాదు... జూన్‌లో కేసు నమోదు

లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి- బూర్జ

ఆరుగాలం కష్టాన్ని నమ్ముకుని సేద్యం చేసే రైతుకు అధికారులు సహకరించాల్సి ఉంది. ముఖ్యంగా సాగునీటి అవసరాల నిమిత్తం చిన్న, సన్నకార రైతులు సోలార్ పంపు చెట్టును ఏర్పాటు చేసుకుని మండలంలో వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానర్స్ ఎప్పటికప్పుడు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు తమ వ్యవసాయ పనిముట్లు, విద్యుత్ పరికరాలు, సోలార్ పంపుసెట్లు దొంగతనాన్ని గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా స్పందించాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకనీరు ఎత్తినట్లు వ్యవహరిస్తుందని బాధిత రైతులు వాపోతున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగుకు అవసరమైన యంత్రాలు పరికరాలు తరచూ దొంగల పాలవుతున్నాయి. తాజాగా ఇదే తరహా ఘటన పలు అనుమానాలకు తావనిస్తుంది. రెండు నెలల క్రితం మండలంలో చీడివలసకి చెందిన చొక్కార అప్పలనాయుడు వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన 16 సోలార్ ప్యానర్స్ మే నెలలో చోరీకి గురయ్యాయి. అప్పట్లో బాధిత రైతు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే మే నెలలో ఫిర్యాదు అందిస్తే... జులై నెలలో 9న పోలీసులు కేసు నమోదు చేయడం విశేషం. అంటే దాదాపు 45 రోజులు పైబడి కేసు నమోదు చేయడానికి పోలీసులకు తీరిక లేకపోవడంపై చర్చనీయాంశమైంది. ఇదే విషయమై పోలీసుల వద్ద ప్రస్తావించగా... సమాధానం చెప్పడానికి దాటవేశారు. అలాగే ఎబిసి పేట, సింగన్నపాలెం, లచ్చయ్యపేట, కంట్రాం, చీడివలస, కొండపేట మండలాల్లోనూ పలు చోరీ ఘటనలపై ఫిర్యాదులు చేశారు.

కాలువ సమస్య పరిష్కారం



పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పొందూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న కాలువపై సిమెంట్ పలకలు విరిగిపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఈ విషయం ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ఎంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యపై స్థానిక టిడిపి నాయకులు చొరవతో మంగళవారం ప్రొక్లెయినర్‌తో కాలువపై సిమెంట్ పలకలను సరిచేశారు. కాలువపై సిమెంట్ పలకలు విరిగిపోవడం వల్ల నిత్యం బస్టాండ్‌లోకి రాకపోకలు సాగించే బస్సులు కాలువలో ఇరుక్కుపోవడంతో పాటు మురుగునీరు బయటకు వచ్చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అంతేకాకుండా ఆ రహదారి గుండా ప్రయాణాలు సాగించే ద్విచక్రవాహనదారులు విరిగిన సిమెంట్ పలకలు వల్ల ప్రమాదాలకు గురయ్యేవారు. ఎట్టకేలకు టిడిపి నాయకులు చొరవతో పంచాయతీ అధికారులు ప్రొక్లెయినర్‌తో కాలువపై సిమెంట్ పలకలను సరిచేయడంతో సమస్య పరిష్కారం కావడంపై పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు (చిన్నరంగా), కాలెపు శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పర్యవేక్షించారు.

కారు బోల్తా

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిఆంధ్ర వీధి సమీప జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు యువకులు క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని క్రేన్ సహాయంతో మరో ప్రాంతానికి తరలించారు. కాగా, డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

ఇల్లు కూల్చివేత

పలాస : మున్సిపాలిటీలోని శివాజీనగర్ శివాలయం ఎదురుగా నిర్మిస్తున్న దళిత మహిళ ఇల్లును రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చేశారని బాధితురాలు నాగమ్మ తెలిపారు. ఆమె కథనం మేరకు 2009లో బిపిఎల్ కోటాలో పురుషోత్తపురం సర్వే నంబరు 29/92లో రెండు సెంట్లు డీ పట్టాని ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో ఇల్లు నిర్మిస్తుంది. పన్ను కూడా మున్సిపాలిటీకి చెల్లిస్తుంది. అప్పుడు చేసి రేకు ఇల్లు నిర్మించుకొని తన భర్తతో కలిసి నివాసముంటుంది. కాశీబుగ్గ బస్టాండ్‌లో కూరగాయాలు విక్రయిస్తూ... జీవనోపాధి పొందుతుంది. ఈ నేపథ్యంలో రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు రెవెన్యూ అధికారులు డి-పట్టా భూమిపై ఇల్లు నిర్మిస్తున్నారని ఆర్ఐ నిరంజన్ ప్రొక్లెయినర్‌తో ఇంటి ముందు భాగాన్ని కూల్చివేశారు. దీంతో అధికారులు, దళితుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో నాగమ్మ బోరున విలపించింది. దీనిపై తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు వివరణ కోరగా బాధితులు చూపిస్తున్న పట్టాలు నకిలీవని, రెవెన్యూ రికార్డులో ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. పలుమార్లు నిర్మాణం చేపటొద్దని చెబుతున్నా వినిపించుకోకుండా నిర్మాణం చేపట్టారని, అన్ని పరిశీలించిన మేరకే చర్యలు కూల్చివేశామని తెలిపారు.



విలపిస్తున్న నాగమ్మ

పలాసకు కేంద్రీయ విద్యాలయం

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గానికి కేంద్రీయ విద్యాలయం మంజూరైందని ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి 12 ఎకరాలు అవసరం కాగా, సూదికొండ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామని అన్నారు. ఈ తరుణంలో కొంతస్థలం నాయకుల కబ్జాల్లో ఉండగా, మరికొంత స్థలం ఎక్సైజ్‌శాఖ, స్వాతంత్ర్య సమరయోదుదులకు కేటాయించినట్లు అధికారులు గుర్తించామని అన్నారు. ఈయనతో పాటు డిఇఒ కె.వెంకటేశ్వర రావు, తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు, డిటి లక్ష్మీనారాయణ, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, మండల సర్వేయరు గిరి ఉన్నారు.

కంది పప్పు కేంద్రం ప్రారంభం

మార్కెట్‌లో కంది పప్పు ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం సామాన్యులకు అందుబాటులో కంది పప్పు అందుబాటులోకి తీసుకొచ్చిందని ఆర్‌డిఒ అన్నారు. కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో కంది పప్పు దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కంది పప్పు దుకాణంలో కేజీ రూ.169కి అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎవరికి ఎన్ని కేజీలు కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధంగా ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు, సిబిల్ సప్లయి డిటి రవికుమార్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

డిప్లమో విద్యార్థికి స్టేట్ ఫస్ట్




మెమోంటో అందజేస్తున్న నాగేశ్వరరావు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల డిప్లమో మెకానికల్ ఫైనల్ ఇయర్ విద్యార్థి బొడ్డేపు శ్యాంసుందర్ డిప్లొమో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు స్టేట్ బోర్డ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రెండు రోజుల క్రితం విడుదల చేసిన ఫలితాల్లో శ్యామసుందర్ మూడేళ్లలో 4,500 మార్కులకు 4,305 మార్కులు (96.27శాతం) సాధించారని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సోంపేట మండలం కొండపోలేరుకు చెందిన శ్యాంసుందర్ తల్లితండ్రులు పేద వ్యవసాయ కుటుంబానికి చెందినవారన్నారు. క్రమ శిక్షణతో శ్రమించి చదివినందుకు శ్యామ్‌సుందర్‌కు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లొమో డిప్యూటీ డైరెక్టర్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు, బోధన, భోధనేతర సిబ్బంది అభినందించారు.

విత్తన బంతులతో సామాజిక వనాలు

లావేరు: విత్తన బంతులతో సామాజిక వనాలు తయారవుతాయని బుడుమురు జెడ్‌పి పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు అన్నారు. మండలంలోని ఈకో క్లబ్ విద్యార్థులు విత్తన బంతులను మంగళవారం తయారు చేశారు. వీటిని రోడ్డుకిరువైపులా, చెరువు గట్టులపై వేసేందుకు నిర్ణయించారు. అలా చేయడం వల్ల వర్షాలు పడిన తరువాత వాటిలోని విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా, చెట్లు తయారై సమాజానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పచ్చదనం పెరిగి భూతాపాన్ని తగ్గించవచ్చునని అన్నారు. కాళీ ప్రదేశాల్లో వేస్తే సామాజిక వనాలుగా తయారు అవుతాయని చెప్పారు.



విత్తన బంతులను తయారు చేస్తున్న విద్యార్థులు



ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజు

ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైతుల అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ నూక రాజు అన్నారు. మండలంలోని కనుగులవలసలో పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు ఎరువులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పేరిట పెట్టుబడి సాయం కింద ఏటా ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు జమ చేయనున్నారని తెలిపారు. సబ్సిడీపై అందజేస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను రైతు సేవా కేంద్రాల వద్ద తీసుకొని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని తొలుసూరుపల్లి రైతు సేవా కేంద్రంలో టిడిపి నాయకులు నూక కనకరావు, మెండ దమయంతి, అట్టాడ శ్రీధర్ ఎరువులను పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- నందిగాం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దిమ్మిడిజాల పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై మంగళవారం పరిశీలించారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ జ్వరాలపై సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సలాన కృష్ణారావు, కార్యదర్శి సంతోష కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు అన్నారు. మండలంలోని నెల్లిపర్తిలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను మంగళవారం పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నదని ప్రజలకు అవగాహన కల్పించారు. కాలువల్లో మురుగునీరు నిల్వలు పేరుకుపోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, కాలువల్లో చెత్తాచెదారం వేయరాదని స్థానికులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఆర్‌ఒ కృష్ణ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ జి.భాస్కరరావు ఆదేశించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం సచివాలయ సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. అనంతరం పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పెద్దలక్ష్మీపురం, చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యాధులపై అవగాహన కల్పిస్తూ... అప్రమత్తం చేయాలన్నారు. కార్యదర్శులు ప్రసాదరావు, ఢిల్లీరావు, ప్రధానోపాధ్యాయులు ఎ.వి.రమణమూర్తి, గణపతిరావు పాల్గొన్నారు.



నందిగాం : వివరాలు సేకరిస్తున్న డిపిఒ వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

జాబ్‌మేళాకు స్పందన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ అన్నారు. కళాశాలకు చెందిన జెకెసి కెరీర్ గైడెన్స్, హైదరాబాద్‌కి చెందిన ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించారని చెప్పారు. ఈ మేళాకు 68 మంది నిరుద్యోగులు హాజరయ్యారని, ఇందులో 11 మంది ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, జెకెసి కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి, అధ్యాపకులు వి.శాంతన్‌కుమార్, బి.గిరీష్ పాల్గొన్నారు.

పైనాపిల్ విలువ ఆధారితపై శిక్షణ

ప్రజాశక్తి- కొత్తూరు

పైనాపిల్‌లో ఉండే విటమిన్లు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తుందని కెవికె మాస్టర్ ట్రైనర్ ఎన్.సుజాత అన్నారు. మండలంలోని అడ్డంగిలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై 12 మంది యువతీ, యువకులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడితో పోరాడి గుండె జబ్బులు రాకుండా చేస్తూ, రక్తపోటును అదుపులో ఉంచుతుందని అన్నారు. చక్కెర స్థాయినీ క్రమబద్ధీకరిస్తుందని చెప్పారు. ఇందులో ఉన్న బ్రమోలిన్ ఆహారాన్ని తేలిగ్గా జీర్ణమయ్యేలా చేస్తుందన్నారు. తక్కువ కెలరీలు, అధిక పీచు పదార్థం విటమిన్-సి అని, శరీరంలోని కొవ్వుని తగ్గించడానికి ఉపయోగపడతాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో పైనాపిల్ పంట విరివిగా లభిస్తుందన్నారు. జామ్ జ్యూస్ క్యాండీలను తయారు చేయడంతో వినియోగదారుని ప్రయోజనం ఉంటుందన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర అందుతుందని అన్నారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ ఏరియా కో-ఆర్డినేటర్ సవర ఆనందరావు, బి.వసంత పాల్గొన్నారు.

చక్కెర వ్యాధిపై అవగాహన

పొందూరు : సైలెంట్ కిల్లర్‌గా చెప్పుకునే సుగర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విశ్రాంత సివిల్ సర్జన్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మల్లిబాబు తెలిపారు. పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన సుగర్ వ్యాధిపై మంగళవారం అవగాహన కల్పించారు. సుగర్ వ్యాధి లక్షణాలు ఆధారంగా పరీక్షలు జరిపి తగిన జాగ్రత్తలను తీసుకోవాలని, లేకుంటే దేహంలో అన్ని అవయవాలపై ప్రభావం చూపుతూ మృతికి దారితీస్తుందని అన్నారు. శారీరక వ్యాయామంతో పాటు, తగిన జాగ్రత్తలను తీసుకోవడం ద్వారా సుగర్ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఎ.ధర్మారావు, వి.సూర్యనారాయణ, వై.సతీష్, బి.కళ్యాణి పాల్గొన్నారు.


చెత్తను తొలగిస్తున్న కార్మికులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మెళియాపుట్టి : మండలంలోని మారడికోటలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేసి చెత్తా చెదారాలను తొలగించారు. అలాగే బోర్‌వెల్ ప్లాట్ ఫారం వద్ద, వీధుల్లో, కూడళ్లలో ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. అనంతరం చెత్తా చెదారాలను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దింటి భాగ్యం, ప్రతినిధి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని తెంబూరు మేజర్ పంచాయతీలో ఎపిఎం మనోరత్నం ఆధ్వర్యాన సర్పంచ్ బెనియ వెంకటరమణ పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో, వీధుల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి బ్లీచింగ్ చేయించారు.

ఎఒగా శ్రీనివాసరావు

బూర్జ : మండల వ్యవసాయశాఖ అధికారిగా శ్రీనివాసరావు మంగళవారం నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన మండల ఎఒ వి.రాజేశ్వరరావు శ్రీకాకుళం ఎడి కార్యాలయానికి బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు గతంలో మండల ఎఒగా పనిచేసి కొత్తూరు డెప్యుటేషన్‌పై వెళ్లారు. మళ్లీ ఇక్కడకు బదిలీపై బాధ్యతలను చేపట్టారు.


శ్రీనివాసరావు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ద్విచక్రవాహనదారులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలని, లేకుంటే జైలు శిక్ష, భారీ జరిమాన పోలీసులు విస్తారని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో ద్విచక్రవాహనదారులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ లేకపోతే ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్ర గాయమవుతుందని, ఈ సమయంలో ప్రాణాలు కోల్పోతారని అన్నారు. అందుకు ప్రతిఒక్కరూ వాహనాలు


కోటబొమ్మాళి : మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

నడిపినప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు లాఖినేని శ్రీనివాసులు, న్యాయవాది దుంపల నరసింహమూర్తి, బి.నారాయణరావు, యు.తిరుమలరావు, న్యాయవాద సంఘ కార్యదర్శి పూజారి వాసుదేవరావు పాల్గొన్నారు.

సోంపేట : మండల కేంద్రంలోని సంస్కార భారతి విద్యాసంస్థల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, ఇచ్ఛాపురం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనీల్ విద్యార్థులకు హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, కళాశాల ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, కవి బాబు, పాపారావు పాల్గొన్నారు.


నేత్రాలను పరీక్షిస్తున్న వెంకటరమణ

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

పలాసలోని సత్యసాయి మందిరం వద్ద సత్యసాయి సేవా సమితి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకరఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నేత్ర వైద్య నిపుణులు రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ నేత్రాలకు సంబంధించిన వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తరచూ ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 70 మందికి కంటి కాటారక్టు ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ కన్వీనర్ డోకి జగదీశ్వరరావు, సేవాదల్ కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, బి.కామేశ్వరరావు, కె.కృష్ణస్వామి, టి.సునీత, టి.ఉష పాల్గొన్నారు.

సిఎఫ్ నియామకంలో అవకతవకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం కేసుపురం పంచాయితీలో నూతనంగా ఎన్నికైన సిఎఫ్ నియామకంలో ఎపిఎం సనపల ప్రసాదరావు అవకతవకలకు పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన అయ్యప్ప స్వయంశక్తి సంఘం ఆర్గనైజర్ గౌతమి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు రూపంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎఫ్ నియామకంలో పూర్తిగా పక్షపాత వైఖరి అవలంబించి అవినీతికి పాల్పడారని వివరించారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఎపిఎం వద్ద ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా... సిఎఫ్ నియామకం ఏకపక్షంగా జరగలేదన్నారు. 50 స్వయం శక్తి సంఘాల మద్దతుతోనే సంఘాల అధ్యక్షులు బుడత సరస్వతి సమక్షంలో ఎన్నిక నిర్వహించామని తెలిపారు.


నగదును అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

అమరావతి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రాజధాని అమరావతి అభివృద్ధికి తన వంతు సహాయంగా ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపన రాజశేఖర్‌రెడ్డి రూ.21 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతి నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఈయన వెంట సంతిలక్ష్మీపురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, హనుమంతు చంద్రశేఖర్, ఎస్.తిరుపతి ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం సురక్షితమని వైద్యాధికారి కూన మీనాకుమారి అన్నారు. మండలంలోని అక్కులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ యోజన పథకంలో భాగంగా గర్భిణులకు అమృత ఆహారాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని వైద్యుల సూచనలు, సలహాలను పాటిస్తే... పుట్టబోయే బిడ్డ, తల్లి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అనంతరం 40 మంది మంది గర్భినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. రణస్థలం మండలానికి చెందిన కృష్ణ, రేవతి దంపతుల ఆర్థికసాయంతో 40 మంది గర్భిణులకు, ఆశావర్కర్లకు, ఆస్పత్రి సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేశారు. ఆసుపత్రి సిబ్బంది మొత్తం కలిపి 110


పళ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి మీనాకుమారి

మందికి భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే గర్భిణులకు పళ్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్థనరావు, జిల్లా జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ సాయికృష్ణ, జోనల్ యూత్ ఇన్‌ఛార్జి పవన్, సమితి యూత్ ఇన్‌ఛార్జి షణ్ముఖ, చింతాడ అప్పారావు, సురేష్, గోవింద్, రాజు, నిరంజన్, సంజన, లక్ష్మీరమణమ్మ, కుమారి, శ్రీదేవి పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో మన గ్రోమోర్ సెంటర్, వ్యవసాయ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణాల్లో వ్యవసాయ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.కిరణ్ కుమార్ ఆధ్వర్యాన ఈ తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రికార్డులు, బిల్లు పుస్తకాలు, గొడౌన్ స్టాక్ నిల్వలను తనిఖీ చేశారు. ఈ తనికీలో రూ.4,59,389 విలువ చేసే బిఐఒ ఎరువులను విక్రయాలను నిలుపుదల చేశారు. సంబంధించిన పత్రాలను సమర్పించినంతవరకు విక్రయించకూడదని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అదికారి కార్యాలయం, నాణ్యత నియంత్రణ అధికారి మురళీధర్, ఎడిఎ వి.శ్రీనివాసరావు, మండల ఎఒ డి.విజయభాస్కరావు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ సులభతరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కూటమి ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థ సులభతరం చేసి పేదలకు న్యాయం చేస్తుందని గోవిందపురం పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని గోవిందపురంలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వ్యవస్థలు మాదిరిగానే ప్రజాపంపిణీ వ్యవస్థను భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం తప్ప మరే ఇతర సరుకులు రేషన్ షాపు ద్వారా పంపిణీ


సరుకులను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం బియ్యంతో పాటు అన్ని ఇతర సరుకులు రేషన్ షాపుల ద్వారా అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మాజీ సర్పంచ్ సీపాన గోపి, వైస్ సర్పంచ్ గుంట సత్యం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు పాలవలస వేణుగోపాల్, పాలిన చంద్రయ్య, మెట్ట నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భానుమూర్తి

117 జిఒ రద్దు ఎపిటిఎఫ్ అజెండా

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధ్యాయులకు తీవ్రనష్టం చేస్తున్న 117 జీవోను రద్దు చేయడమే ఎపిటిఎఫ్ ప్రధాన ఎజెండా అని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి స్పష్టం చేశారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 117 జిఒ రద్దు చేయాలని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరినట్లు చెప్పారు. ఈయనతో పాటు మండల అధ్యక్షులు ఎం.రమణరావు, ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, దండ్లా శ్రీనివాసరావు ఉన్నారు.


సత్యనారాయణకు సన్మానిస్తున్న ఆటోడ్రైవర్లు

ఘనంగా ఆటో దినోత్సవం

కోటబొమ్మాళి: అంతర్జాతీయ ఆటో దినోత్సవం సందర్భంగా మండలం హరిశ్చంద్రపురం పంచాయతీలో ఆటో డ్రైవర్లు ఘనంగా దినోత్స వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు వ్యవసాయశాఖ అధికారి పూజారి సత్యన్నారాయణ పాల్గొన్నారు. ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లు కేకును కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వారు నమ్ముకున్న ఆటోను నడుపుకుంటూ... నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. కష్టకాలంలో ఏ రాత్రి సమయంలో ఫోన్‌చేసినా వారు వెంటనే వచ్చి మనకు తోడుగా ఉంటున్నారంటూ వారి సేవలను కొనియాడారు. అంతకుముందు ఆటోడ్రైవర్లు సత్యనారాయణకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

సిసి రోడ్డు, కాలువలు నిర్మించాలి

పలాస : కాశీబుగ్గ సత్యసాయి మందిరం సమీపంలో సిసి రోడ్డు అధ్వానంగా తయారయ్యాయని, నాణ్యతో కూడిన కాలువలు, సిసి రోడ్డు నిర్మించాలని 14, 15వ వార్డుల టిడిపి ఇన్‌ఛార్జిలు నాబల్లి శ్రీనివాసరావు, కె.ధనేశ్వరరావు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో సిసి రోడ్డు, కాలువ నిర్మాణాలు చేవట్టాలని పదేపదే మున్సివల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. మున్సిపల్ అధికారులు చొరవచూపి నిర్మాణాలు చేవట్టాలని కోరారు.

ముస్లిముల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో వివిధ వృత్తుల్లో ముస్లిములు జీవనం సాగిస్తున్నారని, నిరుపేద కుటుంబాలైన ముస్లిముల సంక్షేమానికి టిడిపి కృషి చేస్తుందని ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ముబారక్ అన్నారు. నగరంలోని ఆయన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గడచిన కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెద్దపీట వేశారని అన్నారు. విదేశీ విద్య, ఉపాధి కోసం పథకాలు అందించారని గుర్తు చేశారు. ఈయనతో పాటు నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షులు షాను, ఉపాధ్యక్షులు సయ్యద్ షఫీ, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి సయ్యద్ రోషన్ బాష, కార్యదర్శి షేక్ అహ్మద్, రహమతుల్లా ఖాన్, మొహమ్మద్ బాషాఖాన్, రావుఖాన్, రోషిద్, సలీం, షరియత్ హబీబ్, మేతాబాన్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ దానం

ప్రజాశక్తి- కవిటి

మనం చేసే రక్తదానం మరొకరికి ప్రాణ దానం చేస్తుందని హెల్పింగ్ హెండ్స్ సభ్యుడు కాశీ సాహు అన్నారు. మండలంలోని ఏకువూరుకు చెందిన ఆరేళ్ల వయసు ఉన్న శౌర్యకు అరుదైన బి నెగిటివ్ ఎస్‌డిపి అవసరమైంది. సమాచారం తెలుసుకున్న కుసుంపురానికి చెందిన కేత భాస్కర్ వెంటనే వచ్చి రక్తదానం చేశారు. ఇప్పటి వరకూ ఏడుసార్లు రక్తదానం చేసినట్టు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న భాస్కర్

యూనిఫారాల పంపిణీ

పొందూరు : మండలంలోని కృష్ణాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సర్పంచ్ అంబళ్ల లక్ష్మి విద్యార్థులకు యూనిఫారాలు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాలు రేణుక, జనసేన పార్టీ జిల్లా కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు గార బాబూరావు, లుకలాపు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


యూనిఫారాలను అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి